epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 36 | బుధవారం | 22.05.2024




# అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఆందోళన

- **పురుగులమందు డబ్బాతో తహసీల్దార్ ఆఫీస్ ముందు బైఠాయింపు**
- **అధికారుల హామీతో విరమణ**

స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా : తన వ్యవసాయ భూమిని మరొకరికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన అధికారులు తన భూమి తన పేరా రిజిస్ట్రేషన్ చేయాలని లేని పక్షంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని తహసీల్దార్ కార్యాలయం ముందు తల్లితో సహా ఓ రైతు ధర్నాకు దిగాడు. జనగామ జిల్లా చిల్పూర్ మండల కేంద్రంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అతడికి నచ్చజెప్పగా రెండు రోజులు సమస్య పరిష్కరిస్తారని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో బోళ్ల రాజ్‌కుమార్ అనే బాధితుడు ఆందోళన విరమించాడు. వివరాలలోకి వెళితే .. చిల్పూర్ మండల కేంద్రానికి చెందిన బోళ్ల రాజ్‌కుమార్ గ్రామ శివారులో ఒక ఎకరం 24 గంటల వ్యవసాయ భూమిని తన భార్య స్వప్న పేరు రిజిస్టర్ చేయించాడు. పట్టా పాస్ బుక్ పై ఇండియన్ బ్యాంక్ (మల్కాపూర్ బ్రాంచ్) లో క్రాఫ్ లోన్ తీసుకున్నాడు. కుటుంబ తగాదాల వల్ల భార్య స్వప్న గత కొద్దికాలంగా భర్తకు దూరంగా ఉంటుంది. ఇదే అదనుగా భావించిన కొందరు వ్యక్తులు తన భార్య పేరు ఉన్న ఒక ఎకరం 24 గంటల వ్యవసాయ భూమి అక్రమంగా మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించారు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న రాజ్‌కుమార్ అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి తన భూమి తనకిప్పించాలంటూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు పురుగుల మందు డబ్బాతో నిరసనకు దిగాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు అక్కడకు చేరుకొని అతడికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఆందోళన విరమించకపోవడంతో తహసీల్దార్ సరస్వతి బాధితుడికి నచ్చచెప్పి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో రాజ్‌కుమార్ ఆందోళన విరమించాడు.




# రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్

- వంద రోజుల్లో రుణ మాఫీ అన్నరు..
- రూ.500 బోనస్ ఏమైంది
- పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రైతు రుణ మాఫీ చేస్తామని, పండిన పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ హౌజ్ వద్ద మీడియాతో మాట్లాడారు.**

2 లో



## విత్తనాలపై రైతులకు అవగాహన

2

- పాల్గొన్న వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి



## సన్న, దొడ్డు రకం వడ్లకు బోనస్ ఇవ్వాలి

2

- సీపీఎం రాష్ట్ర నేత అబ్బాస్



## ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలి

3

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

General News




# రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్

- **వంద రోజుల్లో రుణ మాఫీ అన్నారు..**
- **రూ.500 బోనస్ ఏమైంది**
- **పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలి**
- **జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

**జనగామ, మన చౌరాస్తా :** అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రైతు రుణ మాఫీ చేస్తామని, పండిన పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ హౌజ్ వద్ద మీడియాతో మాట్లాడారు. 2014 లో జనగామ జిల్లాలో తెలంగాణ రాక ముందు వరి పంట కంటే, కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక మూడు రెట్లు పెరిగిందన్నారు. తెలంగాణలో గతంలో ఒక పంట పండేది, కానీ తెలంగాణ వచ్చాక రెండు పంటలు పండేలా కేసీఆర్ చేసిన కృషి ఎంతో ఉందని కొనియాడారు. నిన్న క్యాబినెట్ మీటింగ్‌లో రైతులకు నిరాశే ఎదురైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే డిసెంబర్ 09న రూ.2 లక్షల రుణమాఫీ అవుతుందని రైతులు సంతోష పడ్డారని, కానీ అది అమలు కాలేదన్నారు. ఆ తర్వాత 100 రోజుల్లో చేస్తామని మోసం చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ ఆగస్టు అని హామీలిస్తున్నారన్నారు. రైతు బంధు ఎకరానికి రూ.15 వేలు అని చెప్పి.. ఈ ఏడాది ఎంత మందికి ఇచ్చారని పల్లా ప్రశ్నించారు. రైతు బంధును త్వరలోనే 3, 4 ఎకరాలకు పరిమితం చేసేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నదని ఆరోపించారు. రైతులను మోసం చేస్తున్న ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు రైతుల పిల్లలైన పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. తమ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి బిట్స్ పిలనిలో చదువుకున్న స్వచ్ఛమైన వాడన్నారు. తీన్మార్ మల్లన్నపై 56 కేసులు ఉండి, 72 రోజులు జైల్లో ఉన్న నిందితుడని, తీన్మార్ మల్లన్న మరో నాయిమ్ అని విమర్శించారు. తాను ప్రజల ఆవసార్థం జనగామకు వచ్చానని, నా వల్లనే ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వచ్చిందన్నారు. తాను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు అనేక మంది ఉద్యగులను రెగ్యులరైజ్ చేయించానని, ప్రమోషన్లు ఇప్పించానని పేర్కొన్నారు. తెలంగాణ గ్రాడ్యుయేట్లు ఆలోచించి బీఆర్ఎస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గద్దల నర్సింగరావు, గాడిపెల్లి ప్రేమలత రెడ్డి, బైరగొని యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాలపై అవగాహన కల్పించాలి

- **ఎరువుల కొరత లేకుండా చూడాలి**
- **ధాన్యం కొనుగోళ్లను పూర్తిచేయాలి**
- **జిల్లా ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి**



**జనగామ, మన చౌరాస్తా :** రైతులకు విత్తనాలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని, జిల్లాలో ఎరువుల కొరత లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలేని జిల్లా ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి సూచించారు. మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని గానుగు పహాడ్ గ్రామంలోని రైతు వేదికలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి జిల్లా ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వానాకాలం పంటపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలం పంటపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత వహిస్తోందన్నారు. గ్రామస్థాయిలో ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువుల కేంద్రాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎక్కడైనా ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే స్పందించి, త్వరితగతిన పరిష్కరించాలన్నారు. విడి విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయకూడదన్నారు. అదే విధంగా ప్యాక్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు విత్తనాలు, ఎరువులపై షార్ట్ ఫిల్మ్స్ ద్వారా, పల్లెల్లో రైతు సమావేశాలు ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అలాగే రైతులు అవగాహన పొందేందుకు గాను రైతు వేదికల్లో పోస్టర్ లు, బ్యానర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకింగ్ కవర్, రసీదును రైతులు ఎంతో జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సీఎస్ శాంతి కుమారి ఆదేశాల మేరకు విత్తనాలు, ఎరువుల డీలర్ లు తప్పనిసరిగా రైతుల వారీగా మూడు రిజిస్టర్ లను సక్రమంగా నిర్వహించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్థాయిలో ప్రతి రోజూ ఎంఏఓలు, ఏఈఓలు విత్తనాలు, ఎరువుల డీలర్ కేంద్రాలను సందర్శించి, అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షించాలని, క్షుణ్ణంగా రిజిస్టర్ లను తనిఖీ చేయాలని, అదే విధంగా రోజూ వారీ నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు. అనంతరం పాలకుర్తి మండలంలోని ఎల్లరాయిని తొర్రూరు గ్రామ పంచాయతీలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతం, కొనుగోళ్లపై వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ వెంకన్న, డీఏఓ వినోద్ కుమార్, డీసీఎస్ఓ రోజా రాణి, డీఎం సీఎస్ ప్రసాద్, పాలకుర్తి తహసీల్దార్ వెంకటేశం, డీటీలు శ్రీనివాస్, దేవా, ఏఈఓలు, రైతులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



## ఎంసెట్ రాష్ట్ర స్థాయి ర్యాంకర్ కు సత్కారం

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** ఎంసెట్ లో రాష్ట్ర స్థాయి 9వ ర్యాంకు సాధించిన కొంతం మనితేజ్ ను స్టేషన్ ఘన్ పూర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ మండలం శివుని పల్లికి చెందిన కొంతం మనితేజ్ ను స్థానిక మా గార్డెన్స్ లో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అక్కినపల్లి అంజయ్య, పెసర సారయ్య, కన్వీనర్ ఉబ్బని మల్లేశం ఆధ్వర్యంలో మెమొంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యంజాల ప్రభాకర్, కొంతం శ్రీనివాస్, ముగ్ధంపురం కిషోర్, గోలి రాజశేఖర్, దారం రాజు, అయిత కృష్ణమోహన్, ఎండి.రజాక్, కొంగరి అర్జున్ ర్యాంకర్ ని సత్కరించారు.




## సన్న, దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి

- **స్టేషన్‌ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా మార్చాలి**
- **లెదర్ పార్క్‌ను పునరుద్ధరించాలి**
- **రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్**

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** రైతులు పండించిన సన్న వడ్లు, దొడ్డు వడ్లకు విధిగా బోనస్ ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి.అబ్బాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ మండల కేంద్రంలో మంగళవారం సిపిఎం జిల్లా కమిటీ సమావేశం మండల కార్యదర్శి మునిగల రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అబ్బాస్ మాట్లాడుతూ సోమవారం జరిగిన క్యాబినెట్ మీటింగ్ లో కేవలం సన్న వడ్లకే బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతుకు న్యాయం చేయాలన్నారు. వానకాల సీజన్ కు సరిపడ విత్తనాలు, ఎరువులు మార్కెట్లో ఉంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చెరువులు, కుంటలు, కాల్వల మరమ్మత్తు చేసి గోదావరి జలాలతో నింపాలని కోరారు. స్టేషన్ ఘన్ పూర్ ను మున్సిపాలిటీగా మార్చాలని, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, టెక్స్టైల్ పార్క్, లెదర్ పార్కులను ఏర్పాటుచేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని సమావేశం తీర్మానించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి ఎన్నికల కమిషన్ వత్తాసు పలికిందని ఆరోపించారు. మతతత్వ రాజకీయాలతో మోదీ ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. జిల్లా కార్యదర్శి కనక రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రుణమాఫీ చేసి రైతులకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు సకాలంలో అందించాలని, ప్రైవేట్ ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పరిశీలన

జనగామ, మన చౌరాస్తా : జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని పటేల్ గూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)ను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోని లైట్లు, ఫ్యాన్ల నిర్వహణను పర్యవేక్షించారు. మరుగుదొడ్లను పరిశీలించి, వాటిపై రూఫ్ ను, తలుపుల మరమ్మతులను సరైన విధంగా అమర్చాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే తాగునీరు, ప్రహరీ, గేటు తదితర మౌలిక వసతులపై ఆరా తీసి, తగిన సూచనలు చేశారు. ఈ గుర్తించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.



# చిత్తుగా ఓడించాలి

**- మాజీ మంత్రి దయాకర్ రావు**



**హనుమకొండ, మన చౌరాస్తా :** విద్యావంతుడు రాకేష్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని.. చీటర్స్ ను చిత్తుచిత్తుగా ఓడించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. హనుమకొండ బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ లో మంగళవారం మాట్లాడారు. ఆనాడు సన్నవడ్లు కాదు .. దొడ్డు వడ్లను కొనాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారని.. ఎన్నికల్లో బోనస్ ఇస్తామని చెప్పి.. ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని అంటున్నారని.. రేవంత్ రెడ్డిని రైతులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఓ మాట తరువాత ఓ మాట మాట్లాడుతున్నారని చెప్పారు. తప్పుడు వ్యక్తుల్లో నెంబర్ 1 సీఎం అయితే .. రెండో వ్యక్తి తీన్మార్ మల్లన్న అని అన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో మోసగాళ్లను చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు. అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన విరుచుకుపడ్డారు.

www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way



'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812

# ఓడిన హైదరాబాద్

- 8 వికెట్ల తేడాతో కేకేఆర్ గ్రాండ్ విక్టరీ
- తొలి క్వాలిఫయర్‌లో సన్ రైజర్లకు ఘోర పరాజయం
- కీలక మ్యాచ్‌లో తేలిపోయిన హైదరాబాద్
- రాజస్థాన్, బెంగళూరు మధ్య నేడు ఎలిమినేటర్ మ్యాచ్

**మన చౌరాస్తా, క్రీడా విభాగం :** ఐపీఎల్ 2024 సీజన్ 17 లో భాగంగా తొలి క్వాలిఫయర్‌లో హైదరాబాద్ సన్ రైజర్స్ ఘోర పరాజయం పాలైంది. కోల్ కతా నైట్ రైడర్స్ ను ఓడించి నేరుగా ఫైనల్‌లో అడుగు పెట్టాలనుకున్న సన్ రైజర్స్‌కు గట్టి షాక్ తగిలింది. మంగళవారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన తొలి క్వాలిఫయర్ మ్యాచ్ లో సన్ రైజర్స్ పై కోల్‌కతా 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ 19.3 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. కీలక మ్యాచ్‌లో హైదరాబాద్ బ్యాటర్లు తేలిపో యారు. హైదరాబాద్‌కు మొదటి ఓవర్లోనే ఎదు రుదెబ్బ తగిలింది. ఫస్ట్ ఓవర్లోనే రెండో బాల్ కి ట్రావిస్ డకౌట్ అయ్యాడు. అభిషేక్ శర్మను 3 పరుగులకే వైభవ్ అరోరా పెవిలియన్‌కు పంపాడు. ధాటిగా ఆడుతాడనుకున్న నితీశ్ రెడ్డి కొద్దిసేపటికే 9 పరుగులకే ఔట్ అయ్యాడు. ఆ వెంటనే షాబాజ్ అహ్మద్ కూడా పరుగులేమీ చేయకుండా డకౌట్ అయ్యాడు. వీరిద్దరిని స్టార్క్ ఒకే ఓవర్ లో వరుస బంతుల్లో పెవిలియన్ కు పంపాడు. పేసర్ మిచెల్ స్టార్క్ దాటికి కేవలం 39 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో హెన్రిచ్ క్లాసెన్ 21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్ 32 పరుగులు చేశాడు. త్రిపాఠి కూడా దూకుడుగా ఆడటంతో 10 ఓవర్లకు 92 స్కోరుతో నిలిచింది. దూకుడుగా ఆడుతున్న క్లాసెస్ కూడా ఔట్ కావడంతో మళ్లీ కష్టాల్లో పడింది. త్రిపాఠి కూడా రనౌటయ్యాడు. 126 పరుగులకు 9 వికెట్లు కోల్పోయిన దశలో కమిన్స్ మెరుపులు మెరుపిస్తూ 24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్ లతో 30 పరుగులు చేశాడు. దీంతో హైదరాబాద్ 159 పరుగులు చేయగలిగింది. కోల్కతా బౌలర్లలో స్టార్క్ 3, వరుణ్ చక్రవర్తి 2, వైభవ్ అరోరా, హర్షిత్ రాణా, సునీల్ నరైన్, రస్సెల్ తలా ఓ వికెట్ పడగొట్టారు. అనంతరం 160 పరుగుల లక్ష్య ఛేదనలో కోల్‌కతా రెండు వికెట్లు కోల్పోయి 13.4 ఓవర్లలోనే ఛేదించింది. ఓపెనర్లు రెహ్మానుల్లా గుర్బాజ్ (23), (23 సునీల్ నరైన్ (21) తక్కువ స్కోరుకే వెను దిరిగినా.. వెంకటేశ్ అయ్యర్ 28 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్లతో 51 పరుగులు చేయగా శ్రేయస్ అయ్యర్ కూడా 24 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో (58 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. వీరిద్దరూ మెరుపు వేగతో అర్థ శతకాలు బాదారు. ఇక బుధవారం రాజస్థాన్, బెంగళూరు మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జర గనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టుతో శుక్రవారం హైదరాబాద్ తలపడనుంది.







# బికినీలో ర'కుల్'

- ఇన్ స్టాలో హనీమూన్ ఫోటోలు
- బోల్డ్ లుక్‌తో సెక్సీగా ఉన్నానంటూ క్యాప్షన్

**మన చౌరాస్తా, సినిమా :** 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన గ్లామరస్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్.. ఆ తర్వాత ఇండస్ట్రీలో వరుస ఆఫర్లతో దూసుకుపోయి టాలీవుడ్ ను ఒక ఊపు ఊపేసింది. టాలీవుడ్‌లో దాదాపు అందరు స్టార్ హీరోల సరసన నటించి స్టార్ డమ్ ను సొంతం చేసుకుంది. అయితే కెరీర్ మంచి పీక్స్‌లో ఉన్న సమయంలో ఈ బ్యూటీ.. బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీతో ప్రేమలో పడి ఇటీవలే గోవాలో వివాహం చేసుకుని మ్యారేజ్ లైఫ్ ఎంజాయ్ చేస్తుంది. ఇక ప్రస్తుతం మాల్దీవుల్లో హనీమూన్ విహార యాత్రను వీరిద్దరూ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా జాకీ తీసిన ఫోటోలు ఇన్ స్టాలో పోస్ట్ చేసింది. బికినీ టాప్‌లో ఉన్న ఈ ఫోటోలకి 'ఆకాశం అంచులు దాటిన ప్రదేశంలో నా బ్యూటీ' ని జాకీ భగ్నానీ తీసిన ఫోటోలు హాట్ గా ఉన్నాయంటూ పోస్టు పెట్టింది. బికినీ టాప్ లో హాట్ హాట్ గా ఉన్న రకుల్ ఫోటోలు ఇన్ స్టా గ్రామ్ లో ప్రస్తుతం వైరల్ అయ్యాయి.

